జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 23 | జులై | 2026 ◆ పేజీలు : 6

## నూతన ప్రభుత్వ పాఠశాల భవనం ప్రారంభం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**చర్ల, జూలై 22 (ప్రజాజ్యోతి):** చర్ల మండలంలోని మారుమూల గిరిజన గ్రామం బక్కచింతలపాడులో చర్ల పోలీసుల ఆధ్వర్యంలో నిర్మించిన నూతన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పలకలను పంపిణీ చేసి, ఉపాధ్యాయులు, గ్రామస్తులతో సమావేశమై విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, రోడ్డు భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ

మిగతా 2 లో...

- సివిల్ వివాదాల్లో పోలీసుల పాత్రపై పెరుగుతున్న చర్చ
- స్టేషన్ స్థాయి పనితీరుపై ప్రజల్లో సందేహాలు
- కొద్దిమంది తీరుతో దెబ్బతింటున్న శాఖ ప్రతిష్ఠ
- దీంతో ప్రజల్లో పెరుగుతున్న అనుమానాలు
- పారదర్శక పోలీసింగ్ కోసం పెరుగుతున్న డిమాండ్
- ప్రజా విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం పెద్ద సవాలు
- సంస్కరణలతోనే పోలీస్ వ్యవస్థపై నమ్మకం




6 లో..

# అభాసుపాలవుతున్న... పోలీస్ వ్యవస్థ..!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలీస్ శాఖ పనితీరుపై ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. జిల్లా ఎస్పీ, కొందరు డీఎస్పీలు చట్ట అమలు, నేర నియంత్రణలో కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నప్పటికీ, కింది స్థాయిలోని కొందరు అధికారుల తీరు మొత్తం శాఖ ప్రతిష్ఠను ప్రశ్నార్థకంగా మారుస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా భూ వివాదాల్లో మితిమీరిన జోక్యం, పోక్సో వంటి అత్యంత సున్నితమైన కేసుల దర్యాప్తులో నిర్లక్ష్య ధోరణి, ప్రతి వివాదంలో మధ్యవర్తుల ప్రమేయంతో అనైతిక ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయన్న ఆరోపణలు, కేసుల నిర్వహణలో పారదర్శకత లోపించిందన్న అభిప్రాయాలు జిల్లాలో పలుచోట్ల వ్యక్తమవుతున్నాయి.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

## ఆశ్రమ పాఠశాలల్లో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

- విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే



**చర్ల, జూలై 22 :(ప్రజాజ్యోతి):** భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు బుధవారం చర్ల మండలంలోని పెద్ద మేడిసిలేరు ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, పెద్ద మేడిసిలేరు ఆశ్రమ హైస్కూల్, చిన్న మేడిసిలేరు ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, విద్యా బోధన, వసతి సౌకర్యాలు, కిచెన్ గదుల పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యార్థుల హాజరు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం హాస్టల్‌లోని విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, చదువుకు సంబంధించిన ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం, పరిశుభ్రమైన వాతావరణం, సురక్షితమైన వసతి కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులు, వార్డెన్లు, సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి విద్యార్థికి పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులు కూడా నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకునేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేందుకు

మిగతా 2 లో...

## గిరిజన యువతకు నైపుణ్యాలే భవిష్యత్తు

- అశ్వారావుపేటలో ఐటీడీఏ ఆధ్వర్యంలో యువజన శిక్షణ కేంద్రం ప్రారంభం
- కుట్టు మిషన్లు, కంప్యూటర్లు, బ్యూటీషియన్, టెక్నికల్ స్కిల్స్‌తో ఉపాధి అవకాశాల కల్పన
- శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు, ఉపాధి కల్పనకు చర్యలు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ
- గిరిజన యువత ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి ఐటీడీఏ పీవో రాహుల్



మిగతా 2 లో...

## స్త్రీ నిధి రుణాల రికవరీకి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,జులై 22, (ప్రజాజ్యోతి)** జిల్లాలో స్త్రీ నిధి రుణాల రికవరీని యుద్ధ ప్రాతిపదికన చేపట్టి, వచ్చే రెండు నెలల్లో కనీసం 60 శాతం రికవరీ సాధించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి స్త్రీ నిధి సమీక్ష కమిటీ సమావేశంలో స్త్రీ నిధి డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాచందనతో కలిసి జిల్లాలో స్త్రీ నిధి రుణాల రికవరీ, పెండింగ్ బకాయిలు, మండలాల వారీ పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై

మిగతా 2 లో...

## ఆశ్రమ పాఠశాలల్లో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ





(మొదటి పేజీ తరువాయి...)

మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, క్రమశిక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సంబంధిత సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాఠశాలల ఉపాధ్యాయులు, వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన ప్రభుత్వ పాఠశాల భవనం ప్రారంభం





(మొదటి పేజీ తరువాయి...)

విద్య ప్రతి చిన్నారి భవిష్యత్తుకు బలమైన పునాది అని అన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని పిల్లలు కూడా నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులలో ప్రతిభను గుర్తించి వారికి తగిన ప్రోత్సాహం అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం, క్రమశిక్షణ, నైతిక విలువలు, విద్యార్థుల హాజరు శాతం పెంపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా క్రీడలు, యోగా, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని ఎస్పీ సూచించారు. ఇటువంటి కార్యక్రమాలు ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జట్టు భావనను పెంపొందిస్తాయని చెప్పా రు. ఆరోగ్య పరిరక్షణపై మాట్లా డుతూ అనారోగ్యం, ప్రమాదాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు మూఢ నమ్మకాలను నమ్మకుండా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించాలని ప్రజలకు సూచించారు. ఆరోగ్య సమస్యలకు వైద్య చికిత్సే సరైన పరిష్కారమని స్పష్టం చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని, డెంగీ, మలేరియా వంటి వ్యాధుల లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు చిన్నారులకు అవసరమైన అన్ని టీకాలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలని చెప్పారు. రోడ్డు భద్రతా నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో అధికారులు, గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్, ఎస్బీ-2 ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, చర్ల సీఐ రాజు వర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్, ఎంఈఓ రమణ, కాంట్రాక్టర్ సంతోష్, సర్పంచ్ లక్ష్మి, ఉపాధ్యాయురాలు సౌజన్య, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గిరిజన యువతకు నైపుణ్యాలే భవిష్యత్తు





**అశ్వారావుపేట, జూలై 22: ప్రజాజ్యోతి** గిరిజన యువతను స్వయం ఉపాధి వైపు నడిపించేందుకు తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట గిరిజన భవన్‌లో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) భద్రాచలం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువజన శిక్షణ కేంద్రాన్ని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ సంయుక్తంగా ప్రారంభించారు. గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి, వారికి స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని వారు తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, నేటి కాలంలో కేవలం విద్య ఒక్కటే సరిపోదని, విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు. ప్రభుత్వం గిరిజన యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని, దీని ద్వారా వందలాది మంది యువతీ యువకులు తమ జీవితాలను తీర్చిదిద్దుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు. ఈ కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ, కుట్టు మిషన్ శిక్షణ, బ్యూటీషియన్ కోర్సులు, చేతివృత్తులపై ప్రత్యేక శిక్షణ, టెక్నికల్ స్కిల్స్, ఉపాధి ఆధారిత వృత్తి విద్యా కోర్సులు అందుబాటులో ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. శిక్షణను విజయవంతంగా పూర్తిచేసిన వారికి ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు, ఆయా రంగాల్లో ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గిరిజన యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి శిక్షణ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల యువత పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నాణ్యమైన శిక్షణ పొందే అవకాశం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉపాధి కోసం ఎదురు చూడకుండా, నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధి ద్వారా కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ, గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటిలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అత్యంత ముఖ్యమైనవని అన్నారు. యువజన శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకుడికి శిక్షణ అందిస్తామని తెలిపారు. శిక్షణ కాలంలో అవసరమైన మౌలిక వసతులు, శిక్షణా సామగ్రి, నిపుణుల ద్వారా బోధన వంటి అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. శిక్షణ అనంతరం యువత ఉద్యోగ అవకాశాలను పొందేలా ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ సంస్థలతో అనుసంధానం చేసే చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. స్వయం ఉపాధి చేపట్టాలనుకునే వారికి అవసరమైన మార్గదర్శకత్వం, వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన కూడా కల్పిస్తామని వివరించారు. ఈ శిక్షణ కేంద్రం ద్వారా గిరిజన యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందడమే కాకుండా, వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా యువతులు ఆర్థికంగా స్వతంత్రంగా నిలబడేందుకు కుట్టు మిషన్, బ్యూటీషియన్ వంటి కోర్సులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కంప్యూటర్ మరియు టెక్నికల్ స్కిల్స్ ద్వారా ఆధునిక ఉద్యోగ రంగంలో పోటీపడే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్యను తగ్గించడంతో పాటు, స్థానిక యువతకు నైపుణ్యాల ఆధారిత ఉపాధిని కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇటువంటి కేంద్రాలను మరింత విస్తరించే దిశగా చర్యలు చేపడుతోందని కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌బాబు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, జిల్లా సెక్రెటరీ కోలా లక్ష్మీనారాయణ, మున్సిపల్ అధికారులు, ఐటీడీఏ అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, శిక్షణా సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు.

# మేయర్ గణేష్ కొత్త మార్క్..!

- **కార్పొరేషన్‌లో మార్పునకు తొలి అడుగు..**
- **ప్రజావాణితో సమస్యలపై ప్రత్యక్ష దృష్టి..**
- **ప్రతి బుధవారం నిర్వహణకు నిర్ణయం..**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జులై 22, ప్రజా జ్యోతి :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి కొత్త దిశగా తొలి అడుగు పడింది. మేయర్ మూడ్ గణేష్ ఆధ్వర్యంలో బుధవారం తొలి సారిగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ఇకపై ప్రతి బుధవారం ప్రజావాణి నిర్వహించి, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించడం గమనార్హం. కొత్తగూడెం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ సుజాతతో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ ప్రాంతాల ప్రజలు తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రోడ్లు తదితర సమస్యలపై వినతులు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలోనే సమస్యలను గుర్తించి చిత్తశుద్ధితో పరిష్కరించాలని సూచించారు. ప్రతి వార్డులో ఉన్న సమస్యలను ముందుగానే తెలుసుకుని చర్యలు తీసుకుంటే ప్రజావాణికి ఫిర్యాదులు తగ్గుతాయని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులను సహించబోమని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. దీనిని ఒక్క కార్యక్రమంగా కాకుండా ప్రజలకు ఉపయోగపడే వేదికగా కొనసాగించాలని అధికారులకు సూచించారు. కమిషనర్ సుజాత మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే అధికారుల ప్రధాన బాధ్యత అని చెప్పారు. ప్రాధాన్యతా క్రమంలో వినతులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### మార్పు కనిపించాలంటే...

ప్రజావాణి నిర్వహించడం తొలి అడుగు మాత్రమే. ఈ కార్యక్రమంలో వచ్చిన వినతులు నిర్ణీత గడువులో పరిష్కారం పొందితేనే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. ప్రతి బుధవారం స్వీకరించే ఫిర్యాదులపై తదుపరి చర్యలు, పరిష్కార స్థితిని ప్రజలకు తెలియజేస్తూ ముందుకు సాగితే కార్పొరేషన్ పనితీరులో నిజమైన మార్పు కనిపించే అవకాశం ఉంటుంది. ఇదే మేయర్ గణేష్ మార్క్‌గా నిలవాలంటే అమలులోనూ అదే వేగం కనిపించాల్సి ఉంది.

# మారు జాతి పుల్ల పేరుతో చింత చెట్ల దోపిడీ..!

- ఫారెస్ట్ కార్పొరేషన్‌లో అక్రమాలపై అనుమానాల మబ్బులు






**అశ్వరావుపేట, జూలై 22 (ప్రజాజ్యోతి):** అటవీ సంపదను పరిరక్షించాల్సిన వ్యవస్థలోనే అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫారెస్ట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మా రు జాతి పుల్ల లోడింగ్ చేస్తున్నట్లు రికార్డుల్లో చూపిస్తూ, వాస్తవానికి విలువైన చింత చెట్లను నరికి అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీశాయి.స్థానికుల కథనం ప్రకారం, అనుమతులు ఒక పనికి తీసుకుని, క్షేత్రస్థాయిలో మాత్రం చింత చెట్లను నరికి వాహనాల్లో తరలిస్తున్నారని చెబుతున్నారు. దీంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయ నష్టం వాటిల్లే అవకాశముండగా, అటవీ సంపద కూడా క్రమంగా అంతరించిపోతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.అటవీ ప్రాంతాల్లో చింత చెట్లు పర్యావరణ సమతుల్యతకు కీలకమైనవి. అయితే వాటిని లక్ష్యంగా చేసుకుని రాత్రివేళల్లో లేదా పర్యవేక్షణ తక్కువగా ఉన్న సమయంలో నరికివేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు తనిఖీలు చేయకుండా మౌనం పాటిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.ప్రజాప్రతినిధులు, పర్యావరణ ప్రేమికులు ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మారు జాతి పుల్ల లోడింగ్‌కు ఇచ్చిన అనుమతులు, తరలించిన కలప వివరాలు, డిపోల రికార్డులు, రవాణా పత్రాలను బహిర్గతం చేయాలని కోరుతున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి నిజానిజాలు వెలికితీసి, అటవీ సంపదను కాపాడేందుకు కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# విద్యార్థులలో విద్యాసామర్థ్యాలు మెరుగుపరగడాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి



**కొత్తగూడెం కలెక్టరేట్ ,జులై 22(ప్రజా జ్యోతి)** పాల్వంచ పట్టణంలోని బోల్లూరు గూడెం ఉన్నత పాఠశాల లో జరుగుతున్న ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల మూడు రోజుల శిక్షణ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి శిక్షణ కేంద్రం ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ...ఈ విద్యా సంవత్సరం ప్రాథమిక స్థాయిలో జరుగుతున్నటువంటి మౌలిక భాషా గణిత సామర్థ్యాల సాధన కార్యక్రమం విజయవంతంగా అమలు చేయాలని కోరారు, అదేవిధంగా వెనుకబడిన విద్యార్థులకు రెమిడీయేషన్ తరగతులు నిర్వహించి వారి అభ్యసనను మెరుగుపరచాలని, ప్రతి కాంప్లెక్స్ పరిధిలో మూడు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలను కాంపిటెన్సీ పాఠశాలలుగా ప్రకటించడం జరిగిందన్నారు ,ఆ పాఠశాలలో 100% విద్యార్థులు విద్యాసామర్థ్యాలను సాధించాలని తెలియజేయడం జరిగిందనీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెర్ఫార్మెన్స్ గ్రేడ్ ఇండెక్స్ నందు మంచి ఫలితాలు సాధించి ఉన్నత ర్యాంకుకు తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు, అదేవిధంగా పాఠశాలలో అడ్మిషన్ అయిన ప్రతి విద్యార్థి యుడైస్ నందు నమోదు చేయాలని యు డి ఎస్ ఐ లో ఉన్న డేటాని ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకోవడం జరిగిందన్నారు ,ప్రతి విద్యార్థి ఆ విద్యా సంవత్సరం పూర్తయ్యే లోపు ఆ తరగతిలో సాధించాల్సినటువంటి అభ్యసన సామర్థ్యాలు 100% సాధించాలని, జాతీయస్థాయిలో నిర్వహించు ఎన్ ఏ ఎస్ పరీక్ష యందు ఉన్నత ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని చేయాలన్నారు, మధ్యాహ్నం భోజనం నిర్వహణ యందు మెనూ ప్రకారం పాటించాలని, నాణ్యమైన భోజన విద్యార్థులకు అందే విధంగా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు, ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శ్రీరామ్మూర్తి , జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులందరినీ అన్ఫిట్ చేయాలి

- ఏఐటీయూసీ డిమాండ్ – కెఓసీలో నిరసన, యాజమాన్యానికి వినతిపత్రం

**టేకులపల్లి,జూలై 22,ప్రజాజ్యోతి:** మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న సింగరేణి కార్మికులందరినీ మెడికల్ అన్ఫిట్‌గా ప్రకటించాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. బుధవారం కోయగూడెం ఓసీపీలో పిట్ కార్యదర్శి మాలోత్ హరిసింగ్ అధ్యక్షతన కెఓసీ పీఓ కార్యాలయం ఎదుట నిరసన నిర్వహించి, సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కాలరీ మేనేజర్ పేరాల శ్రీనివాస్‌కు అందజేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఇల్లందు ఏరియా బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొంగర వేంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఈ నెల జరిగిన మెడికల్ బోర్డుకు హాజరైన 124 మంది కార్మికుల్లో కేవలం 24 మందినే అన్ఫిట్ చేయడం అన్యాయమని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంత తక్కువ మందిని అన్ఫిట్ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, యాజమాన్యం వెంటనే నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.సింగరేణి కార్మికులు ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తూ అనేక దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారని, ఆరోగ్యం సహకరించకపోయినా ఉద్యోగంలో కొనసాగాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ఉద్యోగం చేయలేని స్థితిలో ఉన్న కార్మికులు తమ జీవనోపాధి, వారసుల కారుణ్య నియామకాల కోసం మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకుంటే అన్ఫిట్ చేయకపోవడం దురదృష్టకరమన్నారు. అర్హులైన వారందరినీ పునఃసమీక్షించి మెడికల్ అన్ఫిట్‌గా ప్రకటించాలని యాజమాన్యాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో మనోజ్ కుమార్, సర్వర్, దల్ సింగ్, సామెల్, కర్ణ, శంకర్, కిషోర్, సాంబశివరావు, వినీత్, మోహన్, షబ్బీర్, బొల్లద్దుల, శ్రీనివాస్, వెంకటనరసయ్య, సతీష్, నాగేశ్వరరావు, శివ, కనకరాజు, మైకేల్, పైడి రాజు, హరిలాల్, రంజిత్, నవీన్ కుమార్, కోటయ్య, కనకయ్య, మాసూద్, భాస్కర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# సాగునీటి సమస్యపై బీఆర్ఎస్ సమావేశం



**చర్ల, జూలై 22 :(ప్రజాజ్యోతి ):** చర్ల మండలంలోని ఆర్.కొత్తగూడెం గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం బీఆర్ఎస్ డివిజన్ నాయకుడు మానెం రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాలిపేరు ప్రాజెక్టు సాగునీటి సమస్య, చర్ల–భద్రాచలం ప్రధాన రహదారి దుస్థితి తదితర ప్రజా సమస్యలపై చర్చించారు.ఈ సందర్భంగా మానెం రామకృష్ణ మాట్లాడుతూ, జూలై 17న రైతులకు తీపికబురు అంటూ తాలిపేరు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు స్వల్పంగా మాత్రమే నీటిని విడుదల చేశారని ఆరోపించారు. అనంతరం సీతారామ ప్రాజెక్టుకు నీటి అవసరం పేరుతో తాలిపేరు ప్రాజెక్టు 15 గేట్లు ఎత్తి పెద్ద ఎత్తున నీటిని గోదావరిలోకి విడుదల చేయడం వల్ల స్థానిక రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని విమర్శించారు.రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన ఆయన మరోసారి రైతుల ప్రయోజనాలకు భంగం కలిగితే బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో–కన్వీనర్ పవన్, బీసీ సెల్ కార్యదర్శి కేప గణేష్, సీనియర్ నాయకులు గొర్ల రాజబాబు, కాకి అనిల్, పంజా రాజు, జోగి రాజు, తెల్లం లక్ష్మీనారాయణ, ఏనూటి జనార్దన్, దామోదర్ల శ్రీనివాసరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటీ మద్రాస్‌లో ఎం.టెక్ సీటు సాధించిన భాను ప్రసాద్



**టేకులపల్లి,జూలై 22,ప్రజాజ్యోతి:** టేకులపల్లికి చెందిన మోకాళ్ల శ్రీనివాసరావు–రాధ దంపతుల కుమారుడు మోకాళ్ల భాను ప్రసాద్ గేట్–2026లో సీఎస్ విభాగంలో 302 స్కోర్ సాధించి, ఐఐటీ మద్రాస్‌లో ఎం.టెక్ (సీఈఎం)లో ప్రవేశం పొందాడు. జూలై 20న ఐఐటీ మద్రాస్‌లో చేరాడు. తన కృషి, పట్టుదలతో ఈ విజయం సాధించాడని తల్లిదండ్రులు తెలిపారు. భవిష్యత్తులో సివిల్స్‌లో విజయం సాధించి ఉన్నత స్థాయికి చేరి పేద ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.

# మానవ హక్కుల చట్టాలపై విద్యార్థులకు అవగాహన

- టేకులపల్లి ప్రభుత్వ పాఠశాలలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సదస్సు



**టేకులపల్లి,జూలై 22, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ కమిటీ ఆధ్వర్యంలో టేకులపల్లి మండల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం మానవ హక్కుల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వారి హక్కులు, బాధ్యతలు, చట్టాలపై అవగాహన కల్పిస్తూ సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా ఎదగాల్సిన అవసరాన్ని వివరించారు. అవగాహన సదస్సు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని ప్రధానోపాధ్యాయుడు అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని విద్యాసంస్థల్లో నిర్వహించాలని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ప్రతినిధులను కోరారు.ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాల్వ సుధాకర్ రావు, ఎన్జీవో ప్రతినిధి ఏ. జగన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. మోహన్‌రావు, టిటిఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, జిల్లా అడ్వైజర్ ఎస్‌కే అబ్బాస్, జిల్లా ఇన్‌చార్జ్ గడ్డం శామ్యూల్, జిల్లా కమిటీ సభ్యురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పాము కాటుకు గురైన మహిళకు 108 సిబ్బంది సకాలంలో వైద్యం

- అత్యవసర సేవలతో ప్రాణాపాయం తప్పిన బాధితురాలు



**టేకులపల్లి,జూలై 22,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం కోక్యతండ గ్రామానికి చెందిన డి. సరోజ (35) బుధవారం పత్తి చేలో వ్యవసాయ పనులు చేస్తుండగా విష పాము కాటుకు గురైంది. కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, ఈఎంటీ రమ్యకృష్ణ, పైలట్ వెంకటరామారావు అత్యంత వేగంగా సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం సరోజను 108 అంబులెన్స్‌లో సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్య చికిత్స అందించారు. పరిస్థితిని పరిశీలించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.సకాలంలో స్పందించి ప్రాణాపాయం నుంచి కాపాడిన 108 సిబ్బంది ఈఎంటీ రమ్యకృష్ణ, పైలట్ వెంకటరామారావుకు బాధితురాలి భర్త రాంసింగ్ కుటుంబ సభ్యుల తో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. స్థానికులు కూడా 108 అత్యవసర సేవల సిబ్బందిని అభినందించారు.



## మూత్రశాలలున్నా మారని విద్యార్థుల తలరాత..

- మూడేళ్లుగా తాళాలకే పరిమితమైన టాయిలెట్లు



**పినపాక,జూలై 22(ప్రజాజ్యోతి )** పినపాక మండలం పెంటన్నగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిధులతో రూ.3.5 లక్షల వ్యయంతో బాలురు, బాలికల కోసం ప్రత్యేక టాయిలెట్లు నిర్మించినప్పటికీ, మూడేళ్లుగా అవి వాడుకలోకి రాకపోవడంతో చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.అప్పటి జిల్లా కలెక్టర్ ప్రియాంక అల చొరవతో 'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీ ఆధ్వర్యంలో, ఉపాధి హామీ పథకం నిధులతో ఈ టాయిలెట్లు నిర్మించారు. పనులు పూర్తయినప్పటికీ బిల్లులు ఆన్ లైన్ లో క్లియర్ కాలేదనే కారణంతో చెల్లింపులు నిలిచిపోయినట్లు సమాచారం. దీంతో టాయిలెట్లకు తాళాలు వేసి ఉంచడంతో విద్యార్థులు వాటిని వినియోగించుకోలేకపోతున్నారు.పాఠశాల చుట్టూ పొలాలు, చెట్లు ఉండటంతో విద్యార్థులు అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తోంది. ఆ ప్రాంతంలో పాములు, విషకీటకాల సంచారం ఉండటంతో చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేసి, టాయిలెట్లను వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా అధికారులు, స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ నిరసన

- రాహుల్ గాంధీ అరెస్టును ఖండించిన నేతలు





**పినపాక,జూలై 22(ప్రజాజ్యోతి)** కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్‌రోడ్‌లో భారీ నిరసన, ర్యాలీ నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పేరం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలొ పలువురు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ దేశ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా వరుస పేపర్ లీకేజీల కారణంగా విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని, నిరుద్యోగ యువత తీవ్ర నిరాశకు గురవుతోందని విమర్శించారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దీనికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై నమోదైన కేసులు, ఆయన అరెస్టు రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగమేనని ఆరోపిస్తూ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు.ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని, విద్యార్థులు, నిరుద్యోగులు, రైతుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో దిశా కమిటీ అధ్యక్షులు మద్దెల సమ్మయ్య,ఎస్సీ సెల్ నాయకులు ప్రసాద్, సర్పంచులు అలివేలు, స్వప్న, అనిత, వెంకటేశ్వర్లు, మట్ట బాబురావు, చందర్రావు, ఉప సర్పంచ్ లు సందీప్, శిరీష, రామ్మోహన్, నవీన్, అచ్చ నవీన్, కాంగ్రెస్ నాయకులు కంది సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, లక్ష్మారెడ్డి, హేమంత్, మహిళా విభాగ ప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఏకలవ్య పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 22, (ప్రజా జ్యోతి)** కొత్తగూడెం జిల్లాలోని ఏడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో (ఈఎంఆర్ఎస్) విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సేవలు, సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి కమిటీ (డీఎల్‌సీ)సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో టేకులపల్లి, ములకలపల్లి, దుమ్ముగూడెం, గండుగులపల్లి, గుండాల, చర్ల, పాల్వంచ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణ, విద్యా ప్రమాణాల మెరుగుదల, తాగునీటి సౌకర్యం, క్రీడా మైదానాలు, డిజిటల్ సదుపాయాలు తదితర అంశాలపై విస్తృతంగా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ మార్గదర్శకాల ప్రకారం అన్ని ఏకలవ్య పాఠశాలల్లో విద్యార్థులకు సికిల్ సెల్ పరీక్షలు, వార్షిక ఆరోగ్య పరీక్షలు, ప్రత కంటి పరీక్షల శిబిరాలు తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక హెల్త్ స్క్రీనింగ్ క్యాలెండర్ రూపొందించి, దాని ప్రకారం పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఏకలవ్య పాఠశాలలో పార్ట్ టైం డాక్టర్ ను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా జిల్లాలోని అన్ని ఏకలవ్య పాఠశాలల్లో ఆర్‌ఓ సిస్టమ్‌తో కూడిన వాటర్ కూలర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దుమ్ముగూడెం, చర్ల ఏకలవ్య పాఠశాలలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి కనెక్షన్ కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు.విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేలా క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పాఠశాలల్లో క్రీడా మైదానాల అభివృద్ధితో పాటు క్రమం తప్పకుండా క్రీడా పోటీలు నిర్వహించాలని ఆదేశించారు.గండుగులపల్లి ఏకలవ్య పాఠశాలలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని, పనులు చేపట్టేలా ఐటీడీఏ అధికారులను ఆదేశించారు. పాఠశాల విస్తరణకు అవసరమైన అదనపు భూమి అంశాన్ని కూడా సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిశీలించాలని సూచించారు.అన్ని ఏకలవ్య పాఠశాలల్లో డిజిటల్ విద్యను మరింత బలోపేతం చేసేందుకు హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, కంప్యూటర్ ల్యాబ్‌లను ఆధునికీకరించాలని, అవసరమైన కంప్యూటర్లు, ఇతర పరికరాల కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం అందించడం అత్యంత ముఖ్యమని , కొన్ని పాఠశాలల్లో క్షేత్ర స్థాయి పరిశీలన సమయంలో నిర్ణీత మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని , ఇకపై అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు అల్పాహారంలో చపాతీలు అందించేందుకు అవసరమైన చోట చపాతీ మేకింగ్ యంత్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచాలని, మొక్కల పెంపకం కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని అన్నారు. తల్లిదండ్రుల కోసం వేచి ఉండే షెడ్లు, అతిథి గృహాలకు అవసరమైన సౌకర్యాలు, పాఠశాల మైదానాల అభివృద్ధి, విద్యుత్ సరఫరా మెరుగుదల, అంతర్గత రహదారుల నిర్మాణం, భద్రతా చర్యల బలోపేతం వంటి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు గిరిజన విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలవాలని, వారికి నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యం, భద్రత, ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి , ట్రైబల్ వెల్ఫేర్ ఆర్ సి ఓ అరుణకుమారి, భద్రాచలం పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్, అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్ పాఠశాల ప్రిన్సిపల్, ఏకలవ్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

## సాగునీటి విషయంలో రాజకీయాలు తగవు

- ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు





**చర్ల, జూలై 22: (ప్రజాజ్యోతి ):** రైతులకు సాగునీరు అందించే విషయంలో బీఆర్ఎస్ నాయకులు మొసలి కన్నీరు కారుస్తూ రాజకీయాలు చేయడం తగదని భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు అన్నారు. రైతాంగ సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రైతుల ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు.భద్రాచలం నియోజకవర్గంలోని చర్ల, దుమ్ముగూడెం మండలాల రైతులకు సకాలంలో సాగునీరు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందన్నారు. సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.కేవలం రాజకీయ లబ్ధి కోసం కొందరు బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రైతుల సమస్యలను రాజకీయాలకు వేదికగా మార్చకుండా వాస్తవాలను గుర్తించాలని, దుష్ప్రచారాలను నమ్మవద్దని రైతులకు సూచించారు.రైతులకు సాగునీరు అందించడం వారి సంక్షేమాన్ని కాపాడడం కాంగ్రెస్ ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని అన్నారు. రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు.

## రైతులకు సాగునీరు అందించాలి

- సీపీఎం మండల కార్యదర్శి మచ్చా రామారావు
- తక్షణమే శాశ్వత సాగునీటి ప్రణాళిక రూపొందించాలని డిమాండ్

**చర్ల, జూలై 22(ప్రజాజ్యోతి ):** చర్ల మండల రైతులకు తక్షణమే సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం చర్ల మండల కమిటీ డిమాండ్ చేసింది. చర్ల మండలంలోని సత్యనారాయణపురంలో బుధవారం నిర్వహించిన రైతుల సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ఈ సమావేశంలో సుమారు 1,200 మంది రైతులు పాల్గొని సాగునీటి సమస్యలపై చర్చించారు.సీపీఎం మండల కార్యదర్శి మచ్చా రామారావు మాట్లాడుతూ మండల రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సమావేశానికి హాజరైన భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు రైతుల సమస్యలను విని సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం స్వాగతించదగ్గ విషయమేనని అయితే వర్షపాతంపై ఆధారపడి మాత్రమే నీటి సరఫరా ఉంటుందన్న వ్యాఖ్యలు రైతులను ఆందోళనకు గురిచేశాయని అన్నారు .వ్యవసాయానికి శాశ్వత పరిష్కారం చూపకుండా వర్షాలపై మాత్రమే ఆధారపడే విధానం సరైంది కాదని ఆయన అన్నారు. ప్రభుత్వం తక్షణమే సాగునీటి నిల్వకు అవసరమైన చర్యలు చేపట్టి రైతులకు నిరంతర నీటి సరఫరా జరిగేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు.తాలిపేరు ప్రాజెక్టు నుంచి వచ్చే కాలువలను వెంటనే మరమ్మతులు చేయడంతో పాటు పూడిక తొలగింపు, లీకేజీల నివారణ వంటి పనులను చేపట్టి, నీరు వృథా కాకుండా అన్ని ఆయకట్టు ప్రాంతాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.రైతుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రైతు సంఘాలు, ప్రజా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో చర్ల మండల రైతు సంఘం నాయకులు కనితి రామారావు, సొంది నారాయణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి విద్యాసంస్థలోని యువతను మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయాలి

- **అదనపు కలెక్టర్ డి. వేణు గోపాల్**



**కొత్తగూడెం కలెక్టరేట్ ,జూలై 22, ప్రజా జ్యోతి** కేంద్ర ప్రభుత్వం యువత కోసం ప్రారంభించిన మై భారత్ పోర్టల్ ద్వారా అందుబాటులో ఉన్న అవకాశాలను ప్రతి విద్యార్థికి చేరేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా యువజన కార్యక్రమాల సలహా సంఘ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం ప్రారంభించిన మై భారత్ పోర్టల్ ద్వారా యువతకు వివిధ రంగాల్లో అవకాశాలు కల్పిస్తోందన్నారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 9 వేల మంది యువత ఈ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని, ప్రత్యేక నమోదు కార్యక్రమం ద్వారా ఈ సంఖ్యను మరింత పెంచాలని సూచించారు.జిల్లాలోని ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్ కళాశాలలతో పాటు అన్ని విద్యాసంస్థలను సందర్శించి ప్రతి విద్యార్థిని మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయించాలని ఆదేశించారు. అదేవిధంగా ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు.జిల్లా స్థాయిలో యూత్ పార్లమెంట్ నిర్వహించి విజేతలను రాష్ట్ర స్థాయికి పంపాలని, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన యువతకు భారత పార్లమెంట్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో నిర్వహించే క్విజ్ పోటీల్లో విజేతలకు దేశ సరిహద్దు రాష్ట్రాల పర్యటన అవకాశం లభిస్తుందని, కొన్ని కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రధాన మంత్రిని కలిసే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాలపై యువతలో విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా వ్యాసరచన, చిత్రలేఖనం, తదితర ఎనిమిది రకాల పోటీలను జిల్లాలో నిర్వహించాలని సూచించారు. జిల్లా స్థాయిలో విజేతలకు కేంద్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ సమావేశంలో డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ వెంకట్రామ్ బాబు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి , జిల్లా షెడ్యూల్ తరగతుల అభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా ఇంటర్మీడి యేట్ విద్యాధికారి వెంకటేశ్వరరావు , జిల్లా విద్యాధికారి వసంత, జిల్లా యువజన క్రీడల అధికారి పరంధామ రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి డా. కామేశ్వర రావు, అడిషనల్ డిఎంహెచ్ఓ.,సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అశ్వరావుపేట అభివృద్ధిపై అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం



**అశ్వరావుపేట జూలై 22 ప్రజా జ్యోతి** గౌరవ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అశ్వరావుపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో ని అన్ని శాఖల అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనుల ప్రస్తుత పరిస్థితిపై శాఖ ల వారీగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సం క్షేమ పథకాలు మరియు అభివృద్ధి ఫలాలు ప్రజలకు సత్వరమే అందేలా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి, వాటికి త్వరితగతిన శాశ్వత పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌బాబు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే జారే ను మర్యాదపూర్వకంగా కలిసిన దమ్మపేట నూతన తహసీల్దార్ మద్దినేని మురళి



**దమ్మపేట, జూలై 22(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండల నూతన తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మద్దినేని మురళి బుధవారం మండలంలోని గండుగులపల్లి గ్రామంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన బాధ్యతలు స్వీకరించిన మద్దినేని మురళికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో రెవెన్యూ సేవలు అందించాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనిచేయాలని సూచించారు. మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ మర్యాదపూర్వక భేటీలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా ఇసుక తరలింపు.. ట్రాక్టర్ సీజ్

**టేకులపల్లి,జూలై 22,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. బుధవారం సాయంత్రం సింగ్య తండా వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను టేకులపల్లి పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు.పోలీసు లు తెలిపిన వివరాల ప్రకారం.. మూడ్ తండాకు చెందిన ఎల్లబోయిన కృష్ణ (30) టీజీ 28 టీ 4989 నంబర్ గల ట్రాక్టర్‌లో జేత్య తండా సమీపంలోని తెల్లవాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక ను టేకులపల్లికి తరలిస్తున్నాడు.వాహనాల తనిఖీల్లో ట్రాక్టర్‌ను ఆపి పరిశీలించగా అవసరమైన అనుమతి పత్రాలు లేకపోవడంతో వెంటనే ట్రాక్టర్‌ను సీజ్ చేసి,సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా టేకులపల్లి ఎస్ఐ తిరుపతి మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇసుకను అక్రమంగా తరలించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజలు కూడా అక్రమ ఇసుక రవాణాకు సహకరించకుండా, ఎక్కడైనా ఇలాంటి ఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# చెత్తను సేంద్రియ ఎరువుగా మారుస్తున్న దమ్మపేట గ్రామ పంచాయతీ

- **సేంద్రియ ఎరువు తయారీని పరిశీలించిన సర్పంచ్ రమాదేవి, ప్రజాప్రతినిధులు**





**దమ్మపేట, జూలై 22(ప్రజాజ్యోతి):** స్వచ్ఛ గ్రామం–హరిత గ్రామం లక్ష్యంగా దమ్మపేట గ్రామ పంచాయతీ వినూత్నంగా ముందుకెళ్తోంది. గ్రామంలో ప్రతి రోజూ సేకరిస్తున్న తడి, పొడి చెత్తను వేర్వేరుగా వర్గీకరించి ప్రభుత్వం నిర్మించిన డంపింగ్ యార్డులో శాస్త్రీయ పద్ధతిలో సేంద్రియ ఎరువుగా తయారు చేస్తూ వ్యర్థాలను సంపదగా మార్చుతోంది. ఈ ప్రక్రియను బుధవారం సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి బండి అనంత్ కుమార్, వార్డు సభ్యులు పరిశీలించారు.డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసిన ప్రత్యేక గదుల్లో తడి పొడి చెత్తను నిల్వ చేసి సేంద్రియ ఎరువు తయారు చేస్తున్న విధానాన్ని వారు పరిశీలించి పారిశుధ్య సిబ్బందిని అభినందించారు. ఇంటింటికీ చెత్త సేకరణను క్రమబద్ధంగా నిర్వహించడం వల్ల గ్రామంలో పరిశుభ్రత నెలకొనడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతోందని తెలిపారు.రసాయనిక ఎరువుల వినియోగం వల్ల భూసారం తగ్గడంతో పాటు మానవ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడుతున్నాయని, ఈ నేపథ్యంలో సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ తయారు చేస్తున్న నాణ్యమైన సేంద్రియ ఎరువు రైతులకు ఉపయోగపడుతుండటం ఆనందకర విషయమని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, చాట్ల శ్రీనివాసరావు, బత్తుల సాయి, పసుమర్తి కుసుమాంబ, దాసరోజు రామారావు, చిన్నశెట్టి నాగలక్ష్మి ముక్తేశ్వరరావు, పూనెం పోలమ్మ, పంచాయతీ సిబ్బంది బసవయ్య, మహాదేవ సాయి, పారిశుధ్య సిబ్బంది, పగడాల గోపి తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి

- **దమ్మపేట మండలంలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జారే**





**దమ్మపేట, జూలై 22(ప్రజాజ్యోతి):** పేద ప్రజలకు వైద్య ఖర్చుల భారం తగ్గించి, అత్యవసర సమయంలో ఆర్థికంగా అండగా నిలిచే ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కులను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం దమ్మపేట మండల కేంద్రం, లింగాలపల్లి గ్రామంలో పలువురు అనారోగ్య బాధితులకు తన చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద ప్రజలకు అవసరమైన వైద్య చికిత్సలు ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆగిపోకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో తోడ్పాటునందిస్తోందన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు త్వరితగతిన అందేలా తాను నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు.నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన బాధ్యత అని పేర్కొన్న ఎమ్మెల్యే, అత్యవసర వైద్య అవసరాల సమయంలో ఎవరూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని చెప్పారు. ప్రజలకు అవసరమైన ప్రతి సంక్షేమ పథకం పారదర్శకంగా, వేగంగా చేరేలా కృషి కొనసాగిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి–రాంబాబు, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి నాయకులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

- సివిల్ వివాదాల్లో పోలీసుల పాత్రపై పెరుగుతున్న చర్చ
- స్టేషన్ స్థాయి పనితీరుపై ప్రజల్లో సందేహాలు
- కొద్దిమంది తీరుతో దెబ్బతింటున్న శాఖ ప్రతిష్ఠ
- దీంతో ప్రజల్లో పెరుగుతున్న అనుమానాలు
- పారదర్శక పోలీసింగ్ కోసం పెరుగుతున్న డిమాండ్
- ప్రజా విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం పెద్ద సవాలు
- సంస్కరణలతోనే పోలీస్ వ్యవస్థపై నమ్మకం




# అభాసుపాలవుతున్న... పోలీస్ వ్యవస్థ..!

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలీస్ శాఖ పనితీరుపై ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. జిల్లా ఎస్పీ, కొందరు డీఎస్పీలు చట్ట అమలు, నేర నియంత్రణలో కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నప్పటికీ, కింది స్థాయిలోని కొందరు అధికారుల తీరు మొత్తం శాఖ ప్రతిష్ఠను ప్రశ్నార్థకంగా మారుస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా భూ వివాదాల్లో మితిమీరిన జోక్యం, పోక్సో వంటి అత్యంత సున్నితమైన కేసుల దర్యాప్తులో నిర్లక్ష్య ధోరణి, ప్రతి వివాదంలో మధ్యవర్తుల ప్రమేయంతో అనైతిక ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయన్న ఆరోపణలు, కేసుల నిర్వహణలో పారదర్శకత లోపించిందన్న అభిప్రాయాలు జిల్లాలో పలుచోట్ల వ్యక్తమవుతున్నాయి.**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

దీంతో పోలీస్ స్టేషన్లు చట్ట ప్రకారం పనిచేస్తున్నాయా, లేక కొందరి స్వార్థ ప్రయోజనాలకు వేదికలుగా మారుతున్నాయా అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని స్థానిక వర్గాలు పేర్కొంటున్నాయి.

### ♦ అధికారుల తీరుతో కింది స్థాయి సిబ్బంది అదే తీరు..

సివిల్ వివాదాలు, భూ తగాదాలు, కుటుంబ కలహాలు, విలువైన ఆస్తులకు సంబంధించిన వివాదాల్లో చట్టపరమైన విధానాల కంటే ప్రభావాలు, సిఫారసులు, డబ్బు లావాదేవీలే ఎక్కువగా పనిచేస్తున్నాయన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఈ తరహా ఆరోపణలు ఒక్కోసారి నిజమా కాదా అన్నది విచారణలో తేలాల్సి ఉన్నా, ఇలాంటి ప్రచారం పెరగడమే పోలీస్ వ్యవస్థ విశ్వసనీయతకు దెబ్బగా మారుతోంది. మరో ఆందోళనకరమైన అంశం ఏమిటంటే, పైస్థాయిలో కొందరు అధికారులు వ్యవహరిస్తున్న తీరు కింది స్థాయి సిబ్బందిపై కూడా ప్రభావం చూపుతోందన్న విమర్శలు ఉన్నాయి. దీంతో కొందరు కానిస్టేబుళ్లు, హోంగార్డులు తమ అధికార పరిధిని మించి వ్యవహరించడం, మధ్యవర్తిత్వాలు చేయడం, స్థానిక వివాదాల్లో జోక్యం చేసుకోవడం వంటి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు ప్రత్యేక ఉదాహరణగా ప్రస్తుతం 3 టౌన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఓ పెట్రో కార్ డ్రైవర్ నిలుస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. అతను కేవలం హోం గార్డ్ కానిస్టేబులే అయినప్పటికీ, అధికారుల అనైతిక కార్యకలాపాలన్నీ అతని ఆధీనంలోనే నడుస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని రోజుల క్రితం లక్ష్మీదేవిపల్లి స్టేషన్ నుంచి 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన అతను, స్టేషన్‌కు ఫిర్యాదులతో వచ్చే కేసులను తనకు అనుకూలంగా మలుచుకుంటూ వ్యవహరిస్తున్నాడని కొందరు ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. ఇందుకు కొందరు అధికారులు కూడా సహకరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీంతో పోలీస్ స్టేషన్‌కు వెళితే న్యాయం జరుగుతుందా, లేక మరో సమస్య మొదలవుతుందా అనే సందేహం ప్రజల్లో పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు.

### ♦ కొన్ని స్టేషన్లపై ఇలా..

జిల్లాలోని కొన్ని పోలీస్ స్టేషన్ల పేర్లు తరచూ వివాదాల్లో వినిపిస్తున్నాయన్న చర్చ కూడా ఉంది. బూర్గంపాడు, పాల్వంచ పోలీస్ స్టేషన్లపై గతంలో పలు ఆరోపణలు వెలువడ్డాయి. సుజాతనగర్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్లపై కూడా వివిధ సందర్భాల్లో విమర్శలు వచ్చాయి. ఇవన్నీ నిర్ధారిత అంశాలు కాకపోయినా, ఒకే తరహా ఆరోపణలు పదేపదే వినిపించడం ఆందోళన కలిగించే విషయమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇల్లందు డివిజన్ పరిధిలో రాజకీయ ప్రభావం పోలీసింగ్‌పై పడుతోందన్న ఆరోపణలు కూడా తరచూ వినిపిస్తున్నాయి. ఇక్కడ వాస్తవాల కంటే స్థానికంగా ప్రభావశీలుల మాటకే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దమ్మపేట ప్రాంతంలో కూడా కొన్ని కేసుల వ్యవహారంలో ఇలాంటి చర్చలు గతంలో చోటుచేసుకున్నాయి. ఇవన్నీ పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో ఉన్న అనుమానాలను మరింత పెంచుతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కొత్తగూడెం పట్టణాన్ని పరిశీలిస్తే, వన్‌టౌన్, టూ టౌన్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్ల పనితీరుపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. వన్‌టౌన్ పరిధిలో చట్ట అమలు కొంత కట్టుదిట్టంగా ఉందనే అభిప్రాయం ఉన్నప్పటికీ, మిగిలిన స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్ల కదలికలు, గంజాయి కేసులు, ఇతర నేరాలపై మరింత కఠిన చర్యలు అవసరమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో నేర నియంత్రణ కష్టంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇక ట్రాఫిక్ స్టేషన్లైతే ట్రాఫిక్ నియంత్రణ కంటే కేవలం వాటి జలాల పైనే ఎక్కువగా దృష్టి పెట్టి ముందుకు సాగుతున్నట్టు చెబుతున్నారు. ఇక మణుగూరు పోలీస్ స్టేషన్‌పై గతంలో వచ్చిన ఆరోపణలు కూడా జిల్లాలో పెద్ద చర్చకు దారితీశాయి. అక్కడ అవినీతి ఆరోపణల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) చర్యలు తీసుకున్న ఘటన పోలీస్ శాఖ ప్రతిష్ఠను దెబ్బతీసింది. గతంలో కూడా పోలీసులపై ఇలాంటి చర్యలు జరిగినప్పటికీ, ఈ ఘటన మొత్తం వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి ఘటనలే పోలీస్ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని బలహీనపరుస్తున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. భద్రాచలం డివిజన్‌లో కూడా గతంలో కొన్ని ఫిర్యాదులు వచ్చినప్పటికీ, ప్రస్తుతం పరిస్థితులు కొంత మెరుగుపడ్డాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. ప్రత్యేక ఏఎస్పీ పర్యవేక్షణలో వ్యవస్థ గాడిలో పడిందని స్థానిక వర్గాలు చెబుతున్నాయి. ఈ విధానమే మిగతా ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలవాలన్న సూచనలు వినిపిస్తున్నాయి.

### ♦ సంస్కరణలే పరిష్కారం..

ఒక్కో స్టేషన్‌పై వచ్చే ఆరోపణలను వ్యక్తిగత ఘటనలుగా కాకుండా, వ్యవస్థాపరమైన హెచ్చరికలుగా పోలీస్ ఉన్నతాధికారులు పరిగణించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఫిర్యాదులపై వేగంగా అంతర్గత విచారణలు, సిబ్బంది పనితీరుపై నిరంతర పర్యవేక్షణ, సున్నితమైన కేసుల్లో పూర్తి పారదర్శకత, రాజకీయ లేదా ఇతర బాహ్య ప్రభావాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటేనే ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతుందని భావిస్తున్నారు. కొద్దిమంది తీరుతో మొత్తం పోలీస్ శాఖ ప్రతిష్ఠ దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపైనే ఉందని, జిల్లా ఉన్నతాధికారులు ఈ దిశగా చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## జూలూరుపాడు సర్కిల్‌పై పెరుగుతున్న ప్రశ్నలు..!

జిల్లాలో ప్రస్తుతం ఎక్కువగా చర్చకు వస్తున్న సర్కిళ్లలో జూలూరుపాడు సర్కిల్ కూడా ఒకటిగా మారుతోంది. ఈ సర్కిల్ పరిధిలో భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఇతర సివిల్ స్వభావం ఉన్న వ్యవహారాల్లో పోలీసుల జోక్యం అధికమవుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చట్టపరంగా సివిల్ కోర్టుల పరిధిలో పరిష్కారం కావాల్సిన కొన్ని అంశాల్లో కూడా పోలీస్ స్థాయిలోనే పంచాయతీలు నిర్వహించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే విమర్శలు స్థానికంగా వినిపిస్తున్నాయి. స్థానికంగా ప్రభావం ఉన్న కొందరు వ్యక్తులను మధ్యవర్తులుగా వినియోగిస్తూ, ఫిర్యాదుదారులు, ప్రత్యర్థుల మధ్య రాజీ పేరుతో చర్చలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో ఇక్కడ అధికారిక వ్యవస్థ కంటే అనధికార మధ్యవర్తిత్వానికే ప్రాధాన్యం ఇస్తున్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కొన్ని భూ వివాదాల వ్యవహారాల్లో కూడా సివిల్ స్వభావం ఉన్న కేసుల్లో అవసరానికి మించి పోలీస్ జోక్యం జరిగిందని బాధితులు ఆరోపించిన సందర్భాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. పోలీసుల ప్రధాన బాధ్యత శాంతిభద్రతల పరిరక్షణ అయినప్పటికీ, సివిల్ వివాదాల్లో ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడం చట్టపరమైన పరిమితులపై ప్రశ్నలు లేవనెత్తుతోందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## స్త్రీ నిధి రుణాల రికవరీకి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలి

(మొదటి పేజీ తరువాయి...)

సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రికవరీ శాతం తక్కువగా ఉన్న మండలాల ఏపీఎంలు, మండల సమాఖ్య అధ్యక్షులను జిల్లా కలెక్టర్ నేరుగా కారణాలు అడిగి తెలుసుకున్నారు. రికవరీలో వెనుకబడడానికి దారితీసిన అంశాలను విశ్లేషించి, ఆయా మండలాలకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో స్త్రీ నిధి రుణాల రికవరీ ఆశించిన స్థాయిలో లేదని, మండల స్థాయిలో పెండింగ్ బకాయిలు అధికంగా ఉన్నాయని అన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా జిల్లాలో స్త్రీ నిధి రుణాల రికవరీ శాతం కేవలం 13.5 శాతం మాత్రమే ఉండగా, రాష్ట్రంలో జిల్లా 31వ స్థానంలో ఉండటం ఆందోళనకరమని అన్నారు ,ఈ పరిస్థితిని మార్చేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి రికవరీ పెంపు పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 239 వీవోల వద్ద సున్నా కలెక్షన్లు నమోదయ్యాయని తెలిపారు. ముఖ్యంగా భద్రాచలం, పాల్వంచ, ఇల్లందు, అశ్వరావుపేట ప్రాంతాల్లో రికవరీ శాతం తక్కువగా ఉందని పేర్కొంటూ, ఈ ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటికీ వెళ్లి రుణ గ్రహీతలను కలిసి అవగాహన కల్పించాలని ఆదేశించారు. బకాయిలు ఉన్న ప్రతి మహిళా సంఘాన్ని గుర్తించి, రుణాల సకాల చెల్లింపుపై సభ్యులకు అవగాహన కల్పిస్తూ వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. వచ్చే రెండు నెలల్లో కనీసం 60 శాతం రికవరీ సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని, ప్రతి రోజు ఏపీఎంలు, మండల సమాఖ్య అధ్యక్షులు రికవరీ పురోగతిపై నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. మండల స్థాయిలో రోజువారీ సమీక్షలు నిర్వహించి లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని, మెరుగైన పనితీరు కనబరిచిన మండలాలను అభినందిస్తామని, నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై బాధ్యత నిర్ధారణ చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్త్రీ నిధి డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీకాంత్ మాట్లాడుతూ, స్త్రీ నిధి రుణాల రికవరీ పెంపు ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండలాల వారీగా ప్రత్యేక రికవరీ ప్రణాళిక రూపొందించి, వీవోలు, ఏపీఎంలు, మండల సమాఖ్యలు ప్రతిరోజూ రికవరీ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. బకాయిలు ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులను వ్యక్తిగతంగా కలిసి రుణాల చెల్లింపుపై అవగాహన కల్పించాలని, అవసరమైతే ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. సకాలంలో రుణాలు చెల్లించే సంఘాలను ప్రోత్సహించడంతో పాటు, జాప్యం చేస్తున్న సంఘాలకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలిపారు. రికవరీలో వెనుకబడిన మండలాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ రోజువారీ పురోగతిని సమీక్షిస్తామని చెప్పారు. సకాలంలో రుణాల చెల్లింపు వల్ల మహిళా సంఘాల ఆర్థిక విశ్వసనీయత పెరిగి, భవిష్యత్తులో అధిక మొత్తంలో రుణాలు పొందే అవకాశం ఉంటుందని వివరించారు. అనంతరం జిల్లాలో నిర్మాణంలో ఉన్న వీవో భవనాల పురోగతి, సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకుల స్థాపనకు సంబంధించిన అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించి సంబంధిత అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి మహిళా సంఘాలకు మరింత ఆదాయ వనరులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, డిపిఓ అనూష, అడిషనల్ డిఆర్డిఏ నీలేష్,సంబంధిత అధికారులు, ఏపీఎంలు, మండల సమాఖ్య అధ్యక్షులు, వీవోలు తదితరులు పాల్గొన్నారు.